క్లుప్తంగా

ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి



వీఎస్‌పురంలో ఆధార్ అప్‌డేట్ చేస్తున్న డిజిటల్ అసిస్టెంట్ మునికుమార్

బుచ్చినాయుడుకండ్రిగ: ఆధార్ కార్డులో మార్పులు, చేర్పులను సరి చేసుకోవడానికే ప్రత్యేక ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు తెలిపారు. ఈ కేంద్రాల్లో ఆధార్ అప్‌డేట్ చేసుకోవచ్చని, మండలంలోని 14 గ్రామ సచివాలయాల పరిధిలో ప్రత్యేకంగా ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పంటను ధ్వంసం చేశారని ఫిర్యాదు



ధ్వంసమైన వేరుశనగ పంట

బుచ్చినాయుడుకండ్రిగ: తన పొలంలో సాగు చేసిన వేరుశనగ పంటను తమ గ్రామానికి కన్నలి సుధాకర్, కొప్పల నరసింహులు, మణికంఠం, తొట్టంబేడు నరేష్ ట్రాక్టరుతో దున్ని ధ్వంసం చేశారని పల్లమాల గ్రామానికి చెందిన రైతు మరియమ్మ స్థానిక పోలీసుస్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేసింది. మండలంలోని పల్లమాల గ్రామం పల్లమాల రెవెన్యూ పరిధిలోని సర్వేనంబరు 362–14లో రెండు ఎకరాల పొలం ఉందన్నారు. తన పొలం ఆనుకుని ఉన్న పొరంబోకు భూమి 20 సెంట్లలో వెసిన వేరుశనగ పంటను వారు ట్రాక్టరుతో దున్నేశారని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. దీంతో రూ.30 వేలు నష్టం వట్టిల్లిందని, న్యాయం చేయాలని విన్నవించింది.

మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడిగా దొరబాబు



నియామకపత్రం అందుకుంటున్న దొరబాబు

వరదయ్యపాళెం: మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడిగా చిన్న పాండూరు అరుంధతివాడకు చెందిన ఎస్.దొరబాబు నియమితులయ్యారు. మంగళవారం వరదయ్యపాళెంలో సమావేశమైన జిల్లా ఎమ్మార్పీఎస్ కార్యవర్గ సభ్యులు ఆయనను ఎంపిక చేస్తూ నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం దొరబాబు మాట్లాడుతూ మాదిగల సమస్యలపై గ్రామస్థాయిలో ఐక్యత చాటి పోరాడుతామన్నారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు నేతలు అభినందించారు. కార్యక్రమంలో జిల్లా ఎమ్మార్పీఎస్ నేతలు రాఘవయ్య, వాసుదేవరావు, గౌరిభాస్కర్ తదితరులు ఉన్నారు.

ఇసుకతాగేలిలో ఫ్యామిలీ డాక్టర్



రోగులను పరీక్షిస్తున్న వైద్యుడు

ఏర్పేడు : మండలంలోని ఇసుకతాగేలిలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ సేవలందించారు. సుమారు 80 మందికి బీపీ, షుగర్, రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. దీర్ఘకాలిక రోగులకు ఇంటి వద్దనే చికిత్సలందించారు. కార్యక్రమంలో సర్పంచ్ గురవమ్మ, పీహెచ్‌సీ డాక్టర్ ప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నేత కందాటి ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

గంజాయి కేసులో నిందితుడి అరెస్టు



నిందితుడి అరెస్టు చూపుతున్న సీఐ శివకుమార్ రెడ్డి

వరదయ్యపాళెం: గతంలో పట్టుకున్న గంజాయి కేసులో తప్పించుకుని తిరుగుతున్న ముద్దాయిని అరెస్టు చేసినట్లు సత్యవేడు సీఐ శివకుమార్ రెడ్డి, ఎస్ఐ నాగార్జునరెడ్డి తెలిపారు. గతేడాది సెప్టెంబర్ 24న 2 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్న కేసులో ఇద్దరు ముద్దాయిలను అరెస్టు చేయగా మరో ముద్దాయి నాయుడుపేటకు చెందిన చిరంజీవి తప్పించుకున్నాడు. ముందుగా అందిన సమాచారం మేరకు మంగళవారం ఆటోలో శ్రీకాళహస్తికి వెళ్తున్న చిరంజీవిని సూళ్లూరుపేట–బీఎన్‌కండ్రిగ ప్రధాన రోడ్డు మార్గంలోని సంతవేలూరు కూడలి వద్ద అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. నిందితుని వద్ద ఉన్న ఒకటిన్నర కేజీ గంజాయిని స్వాధీనం చేసుకుని, సత్యవేడు కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

సకల జనులకు సంక్షేమం



లబ్ధిదారుకు సంక్షేమ బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

- అర్హులందరికీ పథకాలు
- ప్రతి కుటుంబానికీ లబ్ధి
- ఎప్పటికప్పుడు ప్రజా సమస్యల పరిష్కారం
- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్) : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సకల జనులకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కొనియాడారు. మంగళవారం మండలంలోని ఇలగనూరు, మిట్టఇల్లు, దళితవాడలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వంలో ఆయన పాల్గొన్నారు. ప్రతి ఒక్కరినీ పేరుపేరునా పలకరించారు. అవ్వాతాతల యోగక్షేమాలు విచారించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. సంక్షేమ బావుటా బుక్‌లెట్ పంపిణీ చేశారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో దుష్టచతుష్టయానికి మళ్లీ భంగపాటు తప్పదన్నారు. ప్రజలు జగనన్న వెంటే ఉన్నారని, మొత్తం 175 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించడం తథ్యమని వెల్లడించారు. గత టీడీపీ హయాంతో పథకాలన్నీ తెలుగు తమ్ముళ్ల జేబులోకి వెళ్లేవని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పేదల ఖాతాలోకి వస్తున్నాయని వివరించారు. రాష్ట్రాభివృద్ధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని స్పష్టం చేశారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని, ఎవరికైనా సాంకేతిక కారణాలతో అందకుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.ఒక్క పేదవాడు కూడా నష్టపోకూడదన్నదే తమ అభిమతమని, అధికారులు సైతం ఈ విషయంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఉన్నం వాసుదేవ నాయుడు, మునిరత్నం, హరి నాయుడు, జెడ్పీటీసీ సభ్యులు అర్చనాదేవి, తహసీల్దార్ సుధీర్‌రెడ్డి, ఎంపీడీఓ తరుణాక్షిరెడ్డి, సీఐ విక్రమ్, ఎస్ఐ రాఘవేంద్ర, నాయకులు సుబ్రమణ్యం నాయుడు, రమణయ్య నాయుడు, బాలాజీ నాయుడు, వైస్ ఎంపీపీ గెరటా రెడ్డి, వెంకటేశ్వరులు నాయుడు, మోహన్ నాయుడు, సుబ్రమణ్యం యాదవ్, భక్తవత్సలం, రాజగోపాల్, బత్తెయ్య, నారాయణ ఆచారి,బాబు, పెంచులయ్య, శీనయ్య, ప్రభాకర్, రఘురాం, గాలి రవి నాయుడు పాల్గొన్నారు.

అప్రమత్తతతో ప్రమాదాల నివారణ



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న డీఎస్పీ విశ్వనాథ్, చిత్రంలో ఎమ్మెల్యే తదితరులు

శ్రీకాళహస్తి : అప్రమత్తతతోనే ప్రమాదాలు నివారణ సాధ్యమని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల వద్ద జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బైక్ ర్యాలీ చేపట్టారు. డీఎస్పీ విశ్వనాథ్ జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తీశ్వరాలయ పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఎంవీఐ దామోదర్‌నాయుడు, సీఐలు అజయ్‌కుమార్, విక్రమ్, వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ సిరాజ్, ఆలయ కమిటీ సభ్యుడు మున్నా రాయల్, నాయకులు ఆర్కాడు శంకర్, సునీతాసింగ్, నాని, పులి రామచంద్ర, సురేష్, ఫజల్, మురళీకృష్ణారెడ్డి, రవి, జయరామయ్య, దాము, భవాజీ, మణి, బాబు, చిట్టి పాల్గొన్నారు



బైక్ ర్యాలీలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తదితరులు

నేడు గడప గడపకు..

నారాయణవనం: మండలంలోని కొండలచెరువు సచివాలయ పరిధిలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ గుణశేఖర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు కొండలచెరువు గ్రామంలోని ఎల్లమ్మగుడి నుంచి ప్రారంభమయ్యే కార్యక్రమంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పాల్గొంటారని చెప్పారు. మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, సచివాలయసిబ్బంది పాల్గొనాలని ఆయన కోరారు.

నేడు జాబ్‌మేళా

వరదయ్యపాళెం: శ్రీసిటీలోని ఆల్‌స్టామ్, మ్యాజిక్ బస్ ఫౌండేషన్, లోకా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంయుక్తంగా బుధవారం వరదయ్యపాళెంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు మ్యాజిక్ బస్ పీఓ అరుణ ఓ ప్రకటనలో తెలిపారు. వరదయ్యపాళెంలోని ఒన్నెస్ కోచింగ్ సెంటర్ వద్ద ఉదయం 9 నుంచి 2 గంటల వరకు మేళా కొనసాగుతుందన్నారు. శ్రీసిటీ, ఇతర పరిశ్రమల్లో వివిధ ఉద్యోగాలకు సంబంధించి పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, ఇతర డిగ్రీ విద్యార్హతలు కలిగిన వారు ఈ ఉద్యోగాలకు అర్హులన్నారు. జాబ్‌మేళాకు హాజరయ్యే వారు ఆధార్, విద్యార్హత సర్టిఫికెట్లు, ఫొటోలతో హాజరు కావాలని కోరారు.

హెల్మెట్ ధరిస్తే ప్రాణాలకు రక్షణ

పిచ్చాటూరు: హెల్మెట్ వాడకంపై ప్రజలకు పోలీసులు అవగాహన కల్పించారు. మంగళవారం సాయంత్రం నాగలాపురం పోలీస్ స్టేషన్ నుంచి హెల్మెట్‌లు ధరించి ద్విచక్రవాహనాల్లో పోలీసులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ హనుమంతప్ప మాట్లాడుతూ హెల్మెట్ ధరించి వాహనం నడపడం వల్ల ప్రమాదం జరిగినా ప్రాణాలు దక్కించుకోవచ్చన్నారు. ప్రతి ద్విచక్ర వాహనదారుడు కూడా విధిగా హెల్మెట్ ధరించి పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ అమరంజిరాజు, రైతు సలహా మండలి చైర్మన్ చిన్నదొరై, సిబ్బంది పాల్గొన్నారు.

ఆడపిల్లే పుట్టాలని కోరుకునే స్థితి రావాలి



సత్యవేడు: బాలికల దినోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

– ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం



నాగలాపురం: ఎస్ఎస్ పురం జెడ్పీ హైస్కూల్‌లో..

వరదయ్యపాళెం: బాలికలు అన్ని రంగాల్లో ఆదర్శంగా రాణించాలని స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. సత్యవేడు జెడ్పీ ఉన్నత బాలికల పాఠశాలలో మంగళవారం నిర్వహించిన జాతీయ బాలిక దినోత్సవంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజంలో అందరూ ఆడపిల్లే పుట్టాలని కోరుకునే స్థితి రావాలని ఆకాంక్షించారు. మహిళల సాధికారత కోసం రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు మహిళల పేరిట ఇస్తూ ప్రాధాన్యత కల్పిస్తున్నారన్నారు. విద్యార్థులకు భద్రతగా దిశ యాప్ ప్రవేశపెట్టిన ఘనత దేశంలోనే మన సీఎం జగనన్నకు దక్కుతుందన్నారు. విద్యార్థి దశలోనే బాలికలు నాయకత్వ లక్షణాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. విద్యకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్న ప్రస్తుత ప్రభుత్వంలో బాలురకు దీటుగా బాలికలు పైచేయి సాధించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సుశీల్ కుమార్ రెడ్డి, ఎంపీడీఓ బాలగణేష్, తహసీల్దార్ సుబ్రమణ్యం, సీఐ శివకుమార్ రెడ్డి, పీడీపీఓ దేవకుమారి, హెచ్‌ఎం ఇందిర పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలకు అండగా సబ్‌ప్లాన్..

ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌ను 10 ఏళ్ల పాటు పొడగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంతో పాటు ఎస్సీ, ఎస్టీ ప్రజాప్రతినిధులు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీ రవి, సురేష్ కుమార్, రాబర్ట్, కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

పిచ్చాటూరులో..

పిచ్చాటూరు: స్థానిక జెడ్పీ హైస్కూల్‌ల్లో నిర్వహించిన బాలికా దినోత్సవ సంబరాల్లో తహసీల్దారు మధుసూధన్ రావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ బాలికా రక్షణకు ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తోందన్నారు. తల్లిదండ్రులు ఆడపిల్లలను బాగా చదివించాలన్నారు. బాలికలు క్రమశిక్షణతో పెరిగి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఎంఈఓ హేమమాలిని అన్నారు. కానిస్టేబుల్ సంధ్య మాట్లాడుతూ బాలికలకు పోలీసులు ఎల్లవేళలా రక్షణగా ఉంటామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం యుగంధర్ రాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, టీచర్లు పాల్గొన్నారు.

నాగలాపురం మండలంలో..

నాగలాపురం మండలం ఎస్ఎస్ పురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థినులతో కలిసి బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం ఉదయ చంద్రిక, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలికా సంరక్షణ అందరి బాధ్యత



తొట్టంబేడు: బాలికా దినోత్సవంలో మాట్లాడుతున్న వైద్యసిబ్బంది



రేణిగుంట పీహెచ్‌సీ ఎదుట ర్యాలీ ప్రారంభిస్తున్న డాక్టర్ ఛత్రప్రకాష్‌రెడ్డి



శ్రీకాళహస్తి రూరల్: విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న చంద్రశేఖర్

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్) : బోనుపల్లె ఉన్నత పాఠశాలలో మంగళవారం జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయని గిరిజ మాట్లాడుతూ బాలికల సంరక్షణ అందరూ బాధ్యతగా భావించాలని కోరారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ కామరాజు మాట్లాడుతూ, గ్రామ కార్యదర్శి అంకయ్య, హెల్త్ అసిస్టెంట్ రమేష్, ఏఎన్‌ఎం రాజ్యలక్ష్మి, ఆశా కార్యకర్తలు కృష్ణమ్మ, జయంతి, వనమ్మ, ఎంఎల్‌హెచ్‌పీలు లిఖిత్ కుమార్,రమ్య, ఇందువదన పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి రూరల్: ఎర్రగుడిపాడు ఎస్టీ కాలనీలో బాలికా దినోత్సవం నిర్వహించారు. తొండమనాడు ప్రజాప్రగతి ట్రస్ట్ కో–ఆర్డినేటర్ చంద్రశేఖర్ అమాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఆడపిల్లలను చదివించటానికి చాలా మంది తల్లిదండ్రులు అనాసక్తి చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ పరిస్థితి మారాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు హరి, మహిళా సంరక్షణ కార్యదర్శి అనూష పాల్గొన్నారు.

ఏర్పేడు : మండలంలోని వివిధ గ్రామాల పాఠశాల్లో ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం బాలికాదినోత్సవం నిర్వహించారు. . ఏర్పేడు, కందాడు, మునగలపాలెం, పాపానాయుడుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో బాలికాదినోత్సవం వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రగతి సంస్థ మండల కన్వీనర్ శిరీషా, ప్రధానోపాధ్యాయులు సునీత, జయకుమార్ రెడ్డి పాల్గొన్నారు.

రేణిగుంట : పట్టణంలో బాలికా దినోత్సవంలో భాగంగా పీహెచ్‌సీ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి ఛత్రప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు. జ్యోతినగర్‌లో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అనితవాణి, లత ఆధ్వర్యంలో మహిళలు ర్యాలీ చేశారు. అంగన్‌వాడీ కార్యకర్త జీవనజ్యోతి పాల్గొన్నారు. అలాగే మండలంలోని ఆర్.మల్లవరం హైస్కూల్‌లో హెచ్‌ఎం శైలజ అధ్యక్షతన ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవ అవగాహన సదస్సు నిర్వహించారు.

రోడ్డు నిబంధనలు తప్పనిసరి



మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ కులశేఖర్

రేణిగుంట : స్థానిక చెక్‌పోస్టు సమీపంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో మంగళవారం రోడ్డ భద్రత వారోత్సవాల్లో భాగంగా తిరుపతి అడిషినల్ ఎస్పీ కులశేఖర్ పలువురు డ్రైవర్లకు నిబంధనలపై అవగాహన కల్పించారు. జాగ్రత్తలు పాటిస్తూ వాహనాలను నడపటం ద్వారా రోడ్డు ప్రమాదాలను నియంత్రించవచ్చన్నారు. అనంతరం వాహన డ్రైవర్లతో రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో రేణిగుంట డీఎస్పీ రామచంద్ర, సీఐలు సుబ్బారెడ్డి, శ్రీహరి, ఎస్ఐ ఈశ్వరయ్య పాల్గొన్నారు.

విద్యార్థినులకు పుస్తకాల పంపిణీ



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులకు లైఫ్ స్కిల్ కోర్సు, స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సు పుస్తకాలను మంగళవారం పంపిణీ చేశారు. ప్రిన్సిపల్ బి.రాజశేఖర్ మాట్లాడుతూ ఈ పుస్తకాలను నిష్ణాతులైన అధ్యాపకులతో సిద్ధం చేయించానట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ దీనదయాళ్ పాల్గొన్నారు.

మ్యాథ్స్‌లో ది స్కూల్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో ఉపాధ్యాయులు

శ్రీకాళహస్తి: ది స్కూల్ విద్యార్థులు మ్యాథ్స్ ఒలంపియాడ్‌లో ప్రతిభ చూపినట్లు కరస్పాండెంట్ జనార్ధన్‌రావు జె పవార్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయిలో నిర్వహించే మ్యాథ్స్ ఒలంపియాడ్‌లో తమ పాఠశాల 4, 5వ తరగతి విద్యార్థులు ప్రతిభ చూపారన్నారు. ప్రధానోపాధ్యాయని విశాల పాల్గొన్నారు.

క్రికెట్ కిట్‌ల పంపిణీ

తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్) : మండలంలోని చిన్నసింగమాలకు చెందిన యువకులకు జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భరత్‌రెడ్డి మంగళవారం క్రికెట్ కిట్‌లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ యువత క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు.

జాబ్ మేళాకు విశేష స్పందన

ఏర్పేడు : మండలంలోని పాపానాయుడుపేట సచివాలయంలో సర్పంచ్ లలిత ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. శ్రీసిటీ, రేణిగుంట, ఏర్పేడు మండలాల కర్మాగారాల ప్రతినిధులు ఖాళీగా ఉన్న ఉద్యోగాల కోసం అభ్యర్థులకు ఇంటర్వ్యూలు చేశారు. ఎంపికైన మహిళల వివరాలను త్వరలో ప్రకటించనున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తంబా సుబ్రమణ్యం, మాజీ కో–ఆప్షన్ సభ్యుడు ఎస్ఎస్‌చంద్ర, వైఎస్సార్ సీపీ నేత కరుణాకరన్, కార్యదర్శి బాలసుబ్రమణ్యంరెడ్డి పాల్గొన్నారు.

డ్రోన్‌తో మందుల పిచికారీపై అవగాహన

శ్రీకాళహస్తి రూరల్ : మండలంలోని మంగళపురి, ముద్దుమూడి, దొడ్లమిట్టలో రైతులకు డ్రోన్‌తో పురుగు మందుల పిచికారీపై మంగళవారం అవగాహన కల్పించారు. ఏఓ గంగలపూడి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ రైతులకు డ్రోన్ పరిజ్ఞానం అందించేందుకు రాస్ కృషి విజ్ఞాన కేంద్రాన్ని ఎంపిక చేసినట్లు వెల్లడించారు.

బాల పురస్కార్‌పై హర్షం



భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న మిద్దె గౌరవిరెడ్డి

రేణిగుంట: గాజులమండ్యంకు చెందిన మిద్దె వెంకటరామిరెడ్డి మనుమరాలు, మిద్దె తరుణ, చంద్రశేఖర్ రెడ్డి కుమార్తె గౌరవిరెడ్డి అత్యంత పిన్న వయస్సులో నాట్యకళాకారిణిగా ప్రతిష్టాత్మక జాతీయ బాల పురస్కార్–2023 అందుకోవడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. సోమవారం వివిధ రంగాల్లో అసాధారణ ప్రతిభ కనబరిచిన 11మంది బాలబాలికలను ప్రధానమంత్రి బాలపురస్కార్–2023కు ఎంపిక చేశారు. వీరికి సోమవారం ఢిల్లీలోని విజ్ఞాన భవన్‌లో జరిగిన కార్యక్రమంలో భారత రాష్ట్రపతి ద్రౌపతిముర్ము చేతుల మీదుగా అందించారు. ఈ మేరకు గాజులమండ్యంలో మంగళవారం పలువురు హర్షం వ్యక్తం చేశారు.

గాజులమండ్యంలోనూ నాట్యప్రదర్శన

గౌరవిరెడ్డి 12 ఏళ్ల కిందట ఐదేళ్లప్రాయంలో రేణిగుంట మండలం గాజులమండ్యంలో వెలసిన శ్రీ కామాక్షి సమేత మూలస్థానేశ్వరాలయ ప్రాంగణంలో కళ్లకు గంతలు కట్టుకుని పాదాలకు పారాణి అద్దుకుని కూచిపూడి నాట్యం చేస్తూ సింహనంది రూపాన్ని చిత్రీకరించి అబ్బురపరిచింది. ఆమె అంచెలంచెలుగా దేశ, విదేశాల్లో ప్రదర్శనలిస్తూ ఎన్నో అవార్డులు, రివార్డులను సొంతం చేసుకుంది. గాజులమండ్యంలో ఆమె తాత మిద్దె వెంకట్రామిరెడ్డికి చెందిన ఇల్లు ఇప్పటికీ ఉంది. వారు తల్లిదండ్రులు చాలా ఏళ్ల కిందట హైదరాబాద్‌లో స్థిరపడ్డారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం



నగదు అందిస్తున్న బియ్యపు పవిత్రారెడ్డి

శ్రీకాళహస్తి రూరల్ : మండలంలోని పుల్లారెడ్డికండ్రిగ దళితవాడకు చెందిన రాగినూతల వెంకటయ్య(59) అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి మంగళవారం మృతుడి కుటుంబీకులను తన కార్యాలయానికి పిలిపించిబియ్యపు పవిత్రారెడ్డి చేతుల మీదుగా రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు.

పరిసరాల పరిశుభ్రత అవసరం

ఏర్పేడు : స్థానిక అశోక్‌నగర్‌లో సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు నల్లపాళెం శివయ్య ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. వ్యక్తిగత పరిశుభ్రత అవసరమని సూచించారు. పీహెచ్‌సీ సీహెచ్ఓ శివరాజు, ఎంపీహెచ్ఓ సుబ్బరాయుడు పాల్గొన్నారు.

పొదుపుతో ఆర్థిక పురోగతి



ఆడిట్ నివేదిక అందిస్తున్న బాలాజీరెడ్డి

రేణిగుంట : మహిళలు స్వయం సహాయక సంఘాల ద్వారా పొదుపు చేస్తే ఆర్థిక పురోగతి సాధించవచ్చని రాస్ ఆడిట్ విభాగాధిపతి బాలాజీరెడ్డి తెలిపారు. మండలంలోని కరకంబాడి ఇందిరానగర్ రాస్ మహిళా జ్యోతి మ్యూచువల్ బెనిఫిట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందిరానగర్ క్లస్టర్‌లోని 56 సంఘాలు, 688 మంది సభ్యులకు సంబంధించి పొదుపు సొమ్ము, రుణాలు, ఇతర లావాదేవీలపై ఆడిట్ చేసి రిపోర్టు అందించారు. కార్యక్రమంలో పీడీ వెంకటేష్, వెంకటకుమార్, బాలాజీ, ఇందుమతి, నాగమణి, జ్యోతి, గౌతమి, స్వాతి, శంకరయ్య పాల్గొన్నారు.

కిశోర బాలికల రక్షణపై ర్యాలీ



విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

బుచ్చినాయుడుకండ్రిగ: కిశోర బాలికలను కాపాడుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎస్ఐ మంజునాథరెడ్డి తెలిపారు. మంగళవారం బుచ్చినాయుడుకండ్రిగ జెడ్పీ ఉన్నత పాఠశాలలోని కిశోర బాలికలతో కలిసి ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పుర వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిశోర బాలిక చదువు ఇంటికి వెలుగని, వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. బాల్యవివాహాలను ప్రతి ఒక్కరూ అడ్డుకోవాలని, అమ్మాయిలకు 18 ఏళ్లు నిండిన తర్వాతే వివాహం చేయాలన్నారు. బాల్యవివాహలను ప్రోత్సహించినా, చేసినా చట్టరీత్యా నేరమని, జైలు శిక్ష తప్పదన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రత్నమ్మ, యోగాగురువు సురేష్‌నాయుడు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో ఎన్జీఓ సంఘం అధ్యక్షుడు



శ్రీనివాసరావుకు తీర్థప్రసాదాలు అందిస్తున్న ఆలయ అధికారులు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని మంగళవారం ఏపీ ఎన్జీఓ సంఘం అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సతీష్‌మాలిక్, శ్రీనాథ్, నారాయణస్వామి, హరియాదవ్ పాల్గొన్నారు.